

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - 16వ కథ -

*ఎప్పుడూ గైనకాలజీ కథలేనా?  వేరే విభాగాల్లో మిత్రుల అనుభవాలు కూడా మీతో పంచుకోవాలనిపించింది. ఈ నెల కథ తాలూకు అనుభవం మా ఎం బి వి ది. ఈ కథలో 'నేను' అంటే 'మా ఎం బి వి.'*

*డాక్టర్ మల్లిపూడి భాస్కర వర ప్రసాద్.*

*సికిందరాబాద్ కిమ్స్ లో సర్జికల్ గాస్ట్రో ఎంటిరాలజిస్ట్.  ఎం బి బి ఎస్  లో  మా క్లాస్ మేట్. .*

*నాకు తెలిసి అతను ఉత్తమ విద్యార్థి, ఉత్తమ వ్యక్తి, డాక్టర్ గా అతనేమిటో ఈ కథలో చెప్పడానికి ప్రయత్నం చేశాను.  ఎం బి వి  అంటే మా అందరికీ గౌరవం, అభిమానం, ప్రేమ. ఇలా చప్పగా చెప్తున్నందుకు నా మీద నాకే విసుగ్గా ఉంది. అతని గురించి వ్రాయాలంటే, కథ ను మించి వ్రాయాల్సి వస్తుంది.*

*ఒక్క మాటలో చెప్పాలంటే*

*"పుణ్యపురుషులందు 'మా ఎం బి వి' వేరయా" అంటాను.*

*పేరుకు ముందు డాక్టర్ అని చేర్చడానికి పెద్దగా గర్వపడను కానీ, 'మా ఎం బి వి' లో "మా " అని అనుకోగలిగినందుకు నాకెంతో గర్వంగా అనిపిస్తుంది. నాకే కాదు, మా క్లాస్ మేట్స్ అందరికీ .*

*ఈ నెల కథ నందించినందుకు, మా ఎంబివికి,  కథలో ముఖ్యపాత్ర అయిన రామ కృష్ణారెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ–*

*చందు శైలజ*

ఉదయాలు నన్ను నిద్రలేపడం తక్కువే.  కానీ  ఉదయం నిద్ర లేవడం రోజూ చూస్తుంటాను. పేరు చెప్పలేని  వింత రంగులతో ఆకాశం మీద ఉదయం గీసే చిత్రాన్ని చూస్తూ  ఆనందిస్తాను.

ప్రతి ఉదయం ఒక కొత్తం చిత్రం.

ప్రతి చిత్రం లోనూ కొన్ని కొత్త రంగులు.

ప్రతి రోజూ ఏదో కొత్త దనం.

లివింగ్ రూం లోకి అడుగుపెట్టాను. ప్రశాంతత చుట్టు ముట్టింది. ఎన్నో దేశాలు తిరిగిన తర్వాత,  తెలిసిన సత్యమేమిటంటే , ఇంట్లో ఉన్న ప్రశాంతత ఇక్కెక్కడా ఉండదని. ఉదయపు సూర్యకాంతి లోపలికి పడుతూ  లివింగ్ రూం ని మరింత విశాలం చేస్తోంది.

బయట గార్డెన్ లోకి నడిచాను. పూల మొక్కలు సంతోషంగా తలలూపుతూ పలకరించాయి. మా ఇంటిని , ఇంటిముందున్న తోటను చూసిన వాళ్ళెవరైనా ఒక సామెత చెప్తారు. సామెత ద్వారా పొగడ్త నందుకోవాల్సిన వారికి మాత్రం పొగడ్తలంటేనే పడదు.

ఆ రోజు చెయ్యాల్సిన పనులు ఒక సారి చూసుకున్నాను. శనివారం కనుక పెద్ద పనేమీ ఉండకపోవచ్చు.

సాయంత్రం మేము వెళ్ళాల్సిన ఒక ఎంగేజ్ మెంట్ ఉంది. ఇవాళ శనివారమే కాబట్టి. వీలవుతుందేమో చూడాలి.

హాస్పిటల్ కు రెడీ అయి బయటికొచ్చే టైం కు నా లంచ్ బాక్స్, నా బాగ్ అప్పటికే నా పక్కసీట్లో ఉన్నాయి.

నేనైనా ఒక క్షణం లేటవుతానేమో కానీ అవెప్పుడూ క్రమశిక్షణ తప్పలేదు.

“ఇవాళ ఈవెనింగ్ మనో వాళ్ళ అమ్మాయి ఎంగేజ్ మెంట్ ఉంది. మిమ్మల్ని కూడా తీసుకుని వస్తానని చెప్పాను. ”

“తప్పకుండా.” అన్నాను.

చిన్నగా నవ్వింది.

నవ్వులో ఆరోపణలేమీ లేవు గానీ, నేను నిలబెట్టుకోలేని వాగ్దానాలెన్నింటినో గుర్తు తెచ్చింది.

ఆ రోజంతా ఎప్పటిలానే వీకెండ్ పోకడ పోయింది. పెద్ద పనీ లేదు , అలా అని ఖాళీ గానూ లేదు.

‘ఇవాళెలా అయినా ముందే వెళ్ళి, ఇంట్లో సర్ప్రైజ్ ఇవ్వాలి.’ అనుకుంటూ

నాలుగున్నరకు ఇంటికెళ్దామని కార్ పార్క్ కు వచ్చి ఇంటికి ఫోన్ చేశాను.

'వస్తున్నాను రెడీగా ఉండమని' చెప్పబోతుంటే , శ్రీధర్ దూరం నుండి పరిగెత్తుకుంటూ వస్తూ కనిపించాడు. శ్రీధర్ నా అసిస్టెంట్. పనిమంతుడే కాదు బుద్ధిమంతుడు కూడా. పాపం తిండి యావ తప్ప వేరే అవలక్షణాలేమీ లేవు .

డాక్టర్లకు అలవాటు లేని పరుగు వలన దగ్గరకొచ్చి ఆయాస పడుతూ నించున్నాడు.

“ఫోన్ చెయ్యొచ్చుగా శ్రీధర్. ఏంటా పరుగూ?”

“సార్, ఫోన్ బిజీ అని వస్తోంది. సరే కార్ పార్క్ లో దొరుకుతారుగా అనీ వచ్చా.”

మొబైల్ వంక చూసి , మాట్లాడుతున్న కాల్ కట్ చేసి కారు దిగాను

“చెప్పు ..ఏమైంది?”

“ఎమర్జెన్సీ లోఒక కేసుంది. డాక్టర్ శ్రీమన్నారాయణగారు మిమ్మల్నోసారి చూడమన్నారు.”

శ్రీమన్నారాయణగారు మా హాస్పిటల్ లో సీటీ సర్జన్. నాకు మంచి మిత్రుడు. ఎంతో ముఖ్యమైన కేసనుకుంటే తప్ప నాకు కబురు పంపరు.

పద అని కార్ లాక్ చేసి హాస్పిటల్ లోపలికి వచ్చాను.

"ఏంటీ కేసు?" నడుస్తూ శ్రీధర్ ని అడిగాను.

"స్టూడెంట్ సార్. యాక్సిడెంట్ అయి వచ్చాడు. రిబ్స్ ఫ్రాక్చర్ అయాయి. "

"ఇంకెక్కడైనా ఇంజురీస్ ఉన్నాయేమో చూశావా?"

" లేవు సార్ , అంతా బాగానే ఉన్నాడు.”

“ఏం ఏక్సిడెంట్?”

“బైక్ యాక్సిడెంట్?”

"స్టేబుల్ గా ఉన్నాడు సార్. చక్కగా మాట్లాడుతున్నాడు. ఇంటికెళ్తానంటున్నాడు"

"ప్రాబ్లం ఏంటి మరి ?" ఏదో ఆలోచిస్తూ అడిగాను.

"బైక్ లేదు సార్. తుక్కు తుక్కు అయింది. ఎలా వెళ్తాడు ? "

" శ్రీధర్." కోపంగా చూడబోయాను. అప్పటికే ఎమర్జెన్సీ నర్స్ స్టేషన్ దగ్గరున్నాడు. పేషంట్ ఫైల్ తీసుకుని రమ్మని చెప్తున్నాడు.

లోపలు వెళ్తే బెడ్ మీద ఒక స్టూడెంట్ ఉన్నాడు. పక్కనే అతని ఫ్రెండ్సేమో కొంత మంది ఉన్నారు. అందరూ దాదాపు ఒకే రకమైన డ్రెస్సులు వేసుకున్నారు. నేను వెళ్ళగానే అందరూ సైలెంటైపోయారు.

ఆ అబ్బాయి మొహం లేతగా ఉంది. ఇరవై ఏళ్ళకు మించి ఉండవు. బక్కపలచగా ఉన్నాడు. సన్నగా కనిపించాలని డైటింగులవీ చేస్తాడేమో అనిపించింది. రఫ్ గా కనపడడానికి అన్ని ప్రయత్నాలూ చేశాడు.
వయసులో పెద్దగా కనిపించాలని గడ్డం అదీ పెంచాడనిపించింది.

రిబ్ ఫ్రాక్చర్ అయిన చోట ప్లాస్టర్ వేసి ఉంది.

పొట్ట చూశాను.

పై భాగం లో కమిలి పోయి ఉంది .

పరీక్ష చేస్తూ పలకరించాను. పేరేంటో, ఏం చేస్తుంటాడో , ఏక్సిడెంట్ ఎలా అయిందో అడిగితే చెప్తున్నాడు.

మాటల్లో ఇంగ్లీషు ఎక్కువ , తెలుగు తక్కువ

క్రియాపదాలన్నీ ఇంగ్లీషువే వాడుతున్నాడు.

అతనెలా వెళుతున్నాడో, కుక్కను తప్పించబోయి తనెలా డివైడర్ కు గుద్దుకున్నాడో, లేచి చూసే సరికి తను రోడ్డుకవతల పడిపోయి ఉన్నాడనీ. కొంత సేపటివరకూ అసలేం జరిగిందో అర్థం కాలేదనీ చెప్పాడు.

చాలా మర్యాదగా మాట్లాడాడు. ఇప్పటి పిల్లలు వాళ్ళ జీవితం పట్ల నిర్లక్ష్యంగా ఉంటారనీ, ఎవరిదగ్గర ఎలా మాట్లాడాలో తెలియదనుకుంటాం కానీ, మన అభిప్రాయాలు తప్పని ఎప్పటికప్పుడు వాళ్ళు నిరూపిస్తూనే ఉంటారు.

చెప్తున్నంత సేపూ, లేచి వెనక దిండు కానుకుని కూర్చుందామనీ ప్రయత్నిస్తున్నాడు. ఏదో కలుక్కుమన్నట్లుంది. కళ్ళల్లో బాధ కనిపించింది. మొహం మీద చిరుచెమటలు అలముకున్నాయి.

అతని అవస్థ చూసి "పర్లేదు, రిలాక్స్" భుజం మీద చేత్తో తట్టి, అతడి ప్రయత్నాలు ఆపేశాను.

"ఇతన్ని అబ్జర్వేషన్ లో ఉంచండి." శ్రీధర్ తో చెప్పాను.

"బాగుంది సార్. వెళ్తాను."

"ఇవాళ్టికి ఉండు. రేపు చూద్దాం" అన్నాను.

రెండుకు రెండు కలిపితే నాలుగు అన్నది లెక్కల్లో తప్ప మెడిసిన్ లోనూ , జీవితంలోనూ కాదు .

"బాగానే ఉన్నాడు కదా సార్. తీసుకెళ్ళొచ్చా? అంతగా అయితే ఏదైనా బాగోక పోతే తీసుకొస్తాం." అతని తరఫు వాళ్ళెవరో అన్నారు.

"వద్దు. ఉంచండి." అన్నాను స్థిరంగా

నిర్ణయాలు తీసుకునేటపుడు టెక్స్ట్ బుక్స్ కన్నా, అనుభవం రాసిన పుస్తకమే ఎక్కువగా పనికొస్తుంది.

అతని రిపోర్ట్స్ అవీ కాసేపు స్టడీ చేశాను. అంతా పూర్తి అయే సరికి చీకటి పడింది. వెళ్తూ ,వెళ్తూ ఆ అబ్బాయి వంక ఓ సారి చూశాను. నవ్వుతూ పక్కనున్న వాళ్ళతో మాట్లాడుతున్నాడు. శ్రీధర్ తో పాటు బయటికొచ్చేసి ఇంటికెళ్ళిపోయాను.

ఇంటికెళ్ళిన తర్వాత దాదాపు హాస్పిటల్ సంగతులు మర్చిపోతాను, ఏవైనా క్రిటికల్ కేసులు ఉంటే తప్ప! వార్డ్ లో అంత ప్రమాదకరమైన పేషంట్లు ఎవరూ లేరు. ఆ రాత్రి పడుకోబోయే ముందు టేబిల్ మీద పట్టుచీర కనిపించింది. నేను వెళ్ళలేని ఫంక్షన్స్ అకౌంట్ లో ఇంకో నంబర్ పెరిగినట్లు గుర్తు చేసింది. . ఫంక్షన్ ఎలా జరిగిందో అడగాలి అనుకుంటూనే నిద్రపోయాను.

తర్వాతి రోజు ఆదివారం . ఒక్క రోజూ పనికి వెళ్ళాల్సిన అవసరం ఉండదు. ఉదయం నుండీ వర్షం. సన్నగా చినుకులు పడుతున్నాయి. లివింగ్ రూం లోనుండి గార్డెన్ లో పూలని చూస్తూ కాఫీ తాగుతున్నాను. పూల చెట్లన్నీ వానలో తడుస్తూ బాగా సంతోషంగా ఊగుతున్నాయి. ఆకుపచ్చని టర్ఫ్ మరింత మెరుస్తోంది.

ఆరోజు ఎక్కడికో వెళ్ళాలని మాత్రం గుర్తు ఉంది. ఎవరిదో గృహ ప్రవేశమో, లేక బ్రంచ్ కో సరిగా తెలియదు. వాతావరణం చాలా బాగుంది.

ఎక్కడో సన్నగా లాండ్ లైన్ మోగింది.

శ్రీధర్ ఉన్నాడు అవతల.

“సార్ , ఒక సారి హాస్పిటల్ కు వస్తారా?”

“ఏమైంది?”

“నిన్న ఎడ్మిట్ చేసిన పేషంట్ కండిషన్ ఏం బాలేదు.”

“ఎవరూ, ఆ బైక్ యాక్సిడెంట్ కుర్రాడా ?”

“అవును సార్. ఎబ్డామినల్ డిస్టెన్షన్, బాగా పెయిన్ తో ఏడుస్తున్నాడు.”

లోపల వార్నింగ్ బెల్స్ ఏవో గట్టిగా మోగాయి. డ్రెస్ మార్చుకుందామని వెళ్ళాను. ఆ రోజు బాగా కావలసిన వారింటిలో సత్యన్నారాయణ వ్రతముందనీ, ఇద్దరం కలిసి వెళ్ళాలని అనుకున్న విషయం గుర్తొచ్చింది.

చిన్న చీటీ మీద హాస్పిటల్ వెళ్తున్నట్టు రాసి దాన్ని కనిపించేట్టు పెట్టాను.

ఆదివారం రోడ్లు ఖాళీగా ఉన్నాయి. చాలా త్వరగానే హాస్పిటల్ కు చేరుకున్నాను.

నేను వెళ్ళేసరికి ఆ అబ్బాయి బెడ్ మీద నిలవలేనంత నొప్పితో బాధపడుతున్నాడు. ఎటు తిరిగినా ఉపశమనం లేక ఆ బాధ ఎలా చెప్పాలో తెలియక తికమకలో ఏదేదో మాట్లాడుతున్నాడు.

మాట మాట్లాడుతున్నా నొప్పి ఎక్కువవుతోందేమో. అవికూడా పూర్తిచెయ్యలేక పోతున్నాడు. మొహం నిండా బాధ ,

నన్ను చూడగానే “సార్, ఏదో ఒకటి చెయ్యండి సార్, ఈ నొప్పి తట్టుకోలేకపోతున్నాను” అన్నాడు.

“ పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్ ఇచ్చారా?”

ఇచ్చినట్లు ఎవరో సమాధానం చెప్పారు.

“ఇంజెక్షన్ పని చెయ్యడానికి టైం పడుతుంది కదా.”

స్కాన్ లో పొట్టలో ద్రవాలు చేరినట్లు రాసి ఉంది.

నొప్పితో చాలా బాధ పడుతున్నాడు. ఉదయంతో పోలిస్తే పొట్ట చాలా ఉబ్బిపోయి ఉంది.

లోపల ఏదో అవయవానికి గాయమైనట్లు తెలుస్తోంది. దేనికయ్యిండొచ్చు?

“శ్రీధర్, సీటీ చేయించావా?”

వెంటనే ఆ రిపోర్ట్ తీసుకుని వచ్చాడు.

సీటీ స్కాన్ రిపోర్ట్ చూస్తే లోపల పాంక్రియాస్ కు గాయమైనట్లు తెలుస్తోంది. అక్కడినుండి కొన్ని రసాయనాలు, రక్తం విడుదల అయి పొట్టలో చేరుకుంటున్నాయి. క్షణ క్షణానికీ అతనికి నొప్పి ఎక్కువ అవుతోంది. వెంటనే ఆపరేషన్ చెయ్యాలి.

పాంక్రియాస్ కు గాయమైతే కనుక్కోవడం కష్టం. డయాగ్నసిస్ మిస్ అయే అవకాశాలు చాలా ఎక్కువ. అంతే కాదు ప్రాణానికి కూడా ప్రమాదమే . త్వరగా డయాగ్నసిస్ చెయ్యగలిగితే కొంతలో నయం.

వాళ్ళ బంధువులను కౌన్సెలింగ్ రూం కు పిలిపించమన్నాను. థియేటర్ రెడీ చేస్తున్నారు.

కౌన్సెలింగ్ చేసే రూం లోకెళ్ళగానే ఎవరెవరో చాలా మంది బంధువులున్నారు.

వాళ్ళకు వీలైనంత త్వరగా పరిస్థితి వివరించి, ఆపరేషన్ చేయాలని చెప్పాను.

అందరు బంధువుల్లానే వాళ్ళూ, ‘ఆపరేషన్ చెయ్యకుండా , మందులతో నయం కాదా?’

‘రిస్క్ ఏమీ లేదు కదా?’

‘ఆపరేషన్ ప్రమాదకరమైంది కాదు కదా!’

‘మేజర్ సర్జరీ కాదు కదా.’

‘అబ్బాయి ప్రాణాలకు ప్రమాదం లేదు కదా’

కంఫర్ట్ జోన్ వదల్లేని ప్రశ్నలే అన్నీ. సాధ్యమైనంత వరకూ, వాటికి నిజాయితీగానే జవాబులు చెప్పాను.

వాళ్ళు ఒప్పుకొని సంతకాలు అవీ చేశాక అబ్బాయిని ఆపరేషన్ థియేటర్ కు తీసుకెళ్లాం. అనుమాన పడ్డట్టే, పాంక్రియాస్ చివరిభాగం దెబ్బ తిన్నది. అక్కడి నుండి విడుదల అయే రసాయనాలతోనూ రక్తంతోనూ పొట్ట నిండి పోయింది. పాంక్రియాస్ లోచాలా వరకూ తొలగించాల్సి వచ్చింది. నేను థియేటర్ నుండి బయటకు రాగానే ఆ అబ్బాయి తాలూకు బంధువులందరూ ఆత్రుతతో చూస్తూ ఉన్నారు.

" ఎలా ఉంది సార్?"

నా మాటలకోసమే అందరూ మౌనంగా నిలబడ్డారు.

పాంక్రియాస్ అనేది ఎక్కడుంటుందో, పైకి కనబడకుండా తగిలిన దెబ్బల్లో దానికి గాయమవడం వలన , ఏం జరిగిందో, ఎంత రక్తం పొట్టలో చేరుకుందో, దాన్ని ఆపరేషన్ సమయంలో ఎలా తీసివేశామో చెప్పాను.

"పాంక్రియాస్ ని చాలా వరకూ తీసెయ్యాల్సి వచ్చింది. ముందు ముందు దాని పర్యవసానాలు ఎలా ఉన్నా, ప్రస్తుతం ఆ అబ్బాయి, జరిగిన గాయానికీ, చేసిన ఆపరేషన్ తట్టుకుని బయట పడేవరకూ పరిస్థితి క్రిటికల్ గానే ఉంటుందన్నాను.

చాలా మంది పేషంట్ల బంధువులు మళ్ళీ మళ్ళీ ఒకే ప్రశ్న అడుగుతారు.

“ప్రాణానికేం ప్రమాదం లేదు కదా?”

లేదని నేను చెప్పాలన్న ఆరాటం వాళ్ళ కళ్ళలో కనిపిస్తూ ఉంది.

“ప్రాణానికి ప్రమాదం లేదు కదా!” మళ్ళీ అడిగారు

“లేదని చెప్తే అది అబద్ధం అవుతుంది. ప్రమాదం ఉంది. యాభై శాతం ఉంది. ప్రస్తుతం జరిగిన ఆపరేషన్ నుండి కోలుకోవాలి అతను. అతను కోలుకోవాలని మీరెంతగా అనుకుంటారో, మేమూ ఆలాగే కోరుకుంటాము. దానికోసం గట్టిగా ప్రయత్నం చేస్తాం కూడా.”

వాళ్ల అనుమానాలకన్నిటికీ జవాబు చెప్పి అందర్నీ పంపించాక చూస్తే మధ్యాహ్నం రెండవుతోంది. లోపలేదోగా ఉంది. శ్రీధర్ తినడానికేదో తెస్తానన్నాడు.

" బయటి నుండి ఏమీ వద్దు శ్రీధర్. వాళ్ళు ఆయిల్ ఎక్కువ వాడతారు." అన్నాను.

" బయటవి తినే అవసరం మీకెప్పటికీ రాదని నా నమ్మకం సార్." అంటూ

కేరేజ్ తీసి భోజనం వడ్డించాడు.

వేడి తగ్గని ఇంటి భోజనం.

వేరొకరికి మనమే ప్రపంచం అయితే తప్ప, మన ప్రపంచం లో మనం నిశ్చింతగా పనిచేసుకోలేము.

భగవంతుడు డాక్టర్ ని చేసేసి వదిలెయ్యడు. ఇంకొన్ని అదృష్టాలు కూడా కలిపి పాకేజి ఇస్తాడు బాగా శ్రద్ధగా పనిచెయ్యమని.

లంచ్ తర్వాత వెంటనే ఇంటికి వెళ్ళ లేదు. ఐ సి యు లోకి అతన్ని షిఫ్ట్ చేశాక రెండు మూడు సార్లు వెళ్ళి చూశాను. రెసిడెంట్ డాక్టర్లకు జాగ్రత్తలు చెప్పి బయటికొచ్చేసరికి చీకటి పడుతోంది.

ఇంట్లోకి వెళ్ళగానే సుతిమెత్తని గమ్మత్తైన పరిమళం చుట్టు ముట్టింది.

“ఎక్కడిదీ ఫ్రాగ్రెన్స్? ”

“పారిజాతాలు. మన గార్డెన్ లో పూస్తే, కోశాను.” ప్లేట్ తీసుకుని వచ్చి టేబిల్ మీద పెట్టింది.

ఎర్ర కాడలున్న తెల్లని పారిజాతాలు.

ఏదీ ఆశించకుండా పరిమళాలు వెదజల్లే తెల్లని పారిజాతాలు. కొందరి వ్యక్తిత్వమూ అంతే పరిమళాలు వెదజల్లుతుంది. హాయినివ్వడం తప్ప వేరే ఏదీ ఆశించరు.

మధ్యాహ్నం భోజనానికి థాంక్స్ చెప్పబోయి ఊరుకున్నాను. మన వాళ్ల దగ్గర మర్యాదలు మనలేవు. హాస్పిటల్ సంగతులేవో చెప్తూ చెప్తూ నిద్రపోయాను.

తెల్లవారు జామున మెలకువ వచ్చింది. మెలకువ రాగానే మొదట ఆ అబ్బాయే గుర్తొచ్చాడు. శబ్దం రాకుండా లేచి బాల్కనీ లోకి వెళ్ళి హాస్పిటల్ ఐ సి యు కి ఫోన్ చేశాను.

అతనెలా ఉన్నాడో వివరాలు విన్న తర్వాత కొంత నిశ్చింతగా ఉంది. ఆ రోజు సోమవారం . హాస్పిటల్ కు త్వరగా వెళ్ళిపోయాను. బిజీగా ఉండే రోజని కాదు గానీ, ఆ పేషంట్ ని చూడాలన్న ఆత్రుతే ఎక్కువగా ఉంది.

ఒక వారం పాటు ఆ అబ్బాయి పరిస్థితి ఏమాత్రం సంతృప్తి కరంగా లేదు. ఒక పూట బాగుంటే ఇంకోపూట పరిస్థితి తారుమారు అయ్యేది. ఎప్పుడూ నిశ్చింతగా ‘ఇక ఫర్వాలేదు’ అనుకోలేకపోయేవాళ్ళం. ఎప్పటికప్పుడు కొత్త సమస్యలొచ్చిపడేవి.

ఓ వారం అయ్యాక ఇన్ఫెక్షన్ సోకింది. ఆ ఇన్ఫెక్షన్ మిగతా అవయవాలకు కూడా పాకింది. ఆ ఇన్ఫెక్షన్ ప్రభావం కిడ్నీల మీద కూడా పడింది. కిడ్నీస్ ఫెయిల్ అయ్యే పరిస్థితి వచ్చింది. ఇన్ఫెక్షన్ క్లియర్ చెయ్యడానికి మళ్ళీ సర్జరీ చెయ్యాల్సి వచ్చింది .

ఆ నిర్ణయాన్ని వాళ్ళ వాళ్ళు ఎలా తీసుకుంటారో తెలియదు. చెప్పాలి.

తండ్రి తో బాటు ఇంకా ముగ్గురో నలుగురో బంధువులు వచ్చారు.

రెండో సారి ఓపెన్ చేయాల్సి వస్తే, డాక్టర్ కి ఆపరేషన్ తాలూకు కష్టం కన్నా, బంధువులని ఒప్పించడమే పెద్ద కష్టం.

కష్టాలు ఎదురవుతాయి. అధిగమిస్తాం.

మరిన్ని కష్టాలు వస్తాయి. సాధించడానికి మరింత ప్రయత్నిస్తాం.

అసలు కష్టాలే ఎదురుకాగూడదని అనుకుంటే,

చాలా ఓపిక ఉండాలి.

చాలా కాలం వేచి చూడాలి.

జీవితంలో చివరిరోజు వరకూ! ఆ తర్వాతే అలాంటి స్థితి వస్తుంది.

వాళ్ళొచ్చారు. పాంక్రియాస్ గ్రంధి లో కొంత భాగం నిర్జీవమవడం వలన , మేము భయపడినట్లే అక్కడ ఇన్ఫెక్షన్ వచ్చిందనీ, మళ్ళీ ఆపరేషన్ చేసి ఆ ఇన్ఫెక్షన్ ని క్లియర్ చేయాలనీ, అవసరమైతే అది బయటికి వచ్చే వీలుగా కొన్న ట్యూబులు అమర్చాల్సి ఉంటుందని చెప్పాను.

అప్పటికే రెండో ఆపరేషన్ గురించి తెలిసినట్లుంది. ప్రతివారి ముఖాల్లోనూ రకరకాల భావాలు.

కోపం , బాధ, విచారం, ఆవేశం.

వాటితో నిండిన ప్రశ్నలు నాకు లక్ష్యాలైనాయి.

"మళ్ళీ ఆపరేషన్ ఎందుకు చేస్తున్నారు , అంటే మొదటి ఆపరేషన్ ఫెయిల్ అయినట్లేనా?"

"ఇన్ఫెక్షన్ ఎందుకు వచ్చింది. సరైన మందులు వాడడం లేదా?"

"రెండో సారైనా ఆపరేషన్ సరిగ్గా జరుగుతుందన్న గారెంటీ ఉందా?"

"మళ్ళీ ఫెయిలైతే ఏంటి పరిస్థితి?"

"అసలు అబ్బాయి కోలుకోవడానికి అవకాశముందా?"

"ఈ సారైనా జాగ్రత్తగా చేస్తారా? "

కోపానికి కోపమెప్పుడూ సమాధానం కాదు.

బాధ కు కోపం బై ప్రోడక్ట్.

కోపం ఉపశమించడానికి ప్రయత్నించకుండా వారి బాధనర్థం చేసుకోవడానికే ప్రయత్నించాను.

పేషంట్ ఉన్న పరిస్థితి కి కారణం అతనికైన అయిన గాయం తాలూకు కాంప్లికేషన్సనీ , అవన్నీ ఊహించినవేననీ, ట్రీట్ మెంట్ లోపం లేదని వివరించాను. ఓపిక, సహనం, సౌజన్యం, దయ నా దగ్గరున్న ఆయుధాలన్నింటినీ వాడాను.

వాళ్ళను ఒప్పించే సరికి రెండు గంటల సమయం పట్టింది.

రోజులు గడుస్తున్నాయి. అప్పటికి పదిహేను రోజులవుతోంది. అసలే బక్కగా ఉన్న ఆ అబ్బాయి గుర్తు పట్టలేనంతగా అయిపోయాడు. కొన్ని రోజులుగా అతనికీ నాకూ ఏదో తెలియని అనుబంధమేర్పడింది. అతని పరిస్థితి బాగుంటే ఆ రోజు మనసంతా సంతోషంగా ఉండేది. అర్థ రాత్రి వేళ ఫోన్ మోగితే జగదీష్ విషయమేమోనని లేచేవాణ్ణి.

ఇవాళ పరిస్థితి అదుపులో ఉంది అనుకుంటుండగా ఏదో ఒక కాంప్లికేషన్ కనిపించేది. పెద్దగా ప్రోగ్రెస్ లేదు, అలా అని ఆశలూ వదలడం లేదు.

హాస్పిటలే ఇల్లైపోయింది. దాదాపు ఏ క్షణాన కబురొచ్చినా వెంటనే వెళిపోవడం , ఆలస్యం చెయ్యకుండా ట్రీట్ మెంట్ ప్లాన్ లో అవసరమైన మార్పులు చెయ్యడం, మేమేదో కష్టపడుతున్నామని ఒక్క సారికూడా అనిపించేదికాదు.

ఆ రోజు నలతగా ఉన్నాడు. రెండు రోజులనుండీ జ్వరమొస్తోంది. నార్మల్ కు రానంటూ మొండికేస్తోంది.

బయట పడాలని అతను చేస్తున్న అభిమన్య పోరాటానికి మేము ప్రేక్షకుల్లా మిగిలిపోతామా?

ఎంత లేదన్నా, మనసు లోపల అలజడి గానే ఉంది.

హాస్పిటల్ లో నా రూం లో కూర్చుని కళ్ళు మూసుకుని ఆలోచిస్తుంటే, తలుపు మీద చప్పుడైంది.

ఎవరా అని చూస్తే జగదీష్ వాళ్ల నాన్న రామకృష్ణ నుంచుని ఉన్నాడు.

రమ్మన్నాను. రోజూ దాదాపు కౌన్సెలింగ్ చేస్తూనే ఉన్నా, ఇంకా తెలుసుకోవాలని ఉంటుందేమో. అతని ఆదుర్దా అతనిది. చేతిలో ఏవో పేపర్లున్నాయి.

“కూర్చో” అన్నాను.

జ్వరం సంగతి ఎలా చెప్పాలా అని చూస్తున్నాను.

చేతిలో ఉన్న పేపర్స్ నా ముందు పెట్టాడు. అర్థం కాలేదు.

"ఏంటివి ?"

" బిల్లులు సార్. మీరు కూడా చూస్తారని తెచ్చాను"

" బిల్సా? అబ్బాయికి ఎలా ఉందో అడగడానికొచ్చావనుకున్నా"

" కాదు సార్, మరి ఇంతింత బిల్లైతే మేమెట్టా తట్టుకుంటాం చెప్పండి. చిన్న వాళ్ళం, పోనీ వార్డ్ కు మార్చేస్తే పోలేదా?"

" అప్పుడే వార్డ్ లో ఉంచే పరిస్థితి లేదు" అన్నాను.

“బిల్ కాస్త చూసి వెయ్యమనండి సార్. అసలిన్నిన్ని ఇంజెక్షన్లెందుకు, అవసరమేనా. పిల్లాడిని వార్డ్ లో ఉంచితే ఈ పాటికి కోలుకునేవాడేమోకదా. ఆ ట్యూబులెన్నాళ్ళుంచుతారసలు. ఆ ట్యూబుల్లో పోసి కడిగే సెలైన్లకేంటీ, మరి నరాలకెక్కించే సెలైన్లకేంటి, మందులేంటి ఎంతెంత అయితందో మీకేం తెలుసు సార్. బిల్ కట్టేప్పుడికి దుంప తెగిపోతా ఉంది మాకు." అంటూ ఆపకుండా ఇరవై నిముషాల పాటు మాట్లాడాడు.

ప్రస్తుతం అతను ఐ సి యు నుండి బయటికి తీసుకు రావడం ఎంత ప్రమాదమో వివరంగా చెప్పాను.

“బయట వార్డులో పెట్టొచ్చు కదా, లోపల చార్జీలు మండిపోతున్నాయి.” అన్నాడు.

ఎల్ కేజీ పిల్లవాడు పదో క్లాసు పరీక్ష కు కట్టినట్టు, వాడికి నేను పైథాగరస్ సిద్ధాంతం బోధిస్తున్నట్లుంది నా పరిస్థితి!

జీవితం అంతే. నేర్చుకునే లోపలే పరీక్షలొచ్చేస్తాయి.

“అది సరే. పరిస్థితి ఎంత ప్రమాదంగా ఉందో అర్థమైందా?”

“అయిందయ్యా, కాస్త బయటి వార్డు లో అయితే బాగుంటదని చెప్తున్నా.”

కోపమొస్తోంది. అతనిపై ప్రయోగించడానికి నా దగ్గర బ్రహ్మాస్త్రమూ లేదు. ఆ పరిస్థితిలో సహనం కోల్పోయి ఏమి అంటానో అని మౌనంగా అతన్నే చూస్తూ ఉన్నాను.

అతను ఆపేసిన తర్వాత ,పరిస్థితి అర్థం చేసుకోకుండా మూర్ఖంగా మాట్లాడుతున్నందుకు తిట్టాను.

“రామ కృష్ణా , కొడుకు గురించి ఒక్కమాటైనా అడక్కుండా ఈ బిల్లుల గొడవేంటీ ?” గట్టిగా అన్నాను.

“ కొద్ది పాటి మనుషులం కదా సార్, మాకు మమకారాలు తక్కువ మరి” అంటూ లేచి నమస్కారం చేసి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

రామకృష్ణ వెళ్ళిన తర్వాత, అతనితో అంత గట్టిగా మాట్లాడక పోతే బాగుండేదనిపించింది. వెంటనే లేచి బయటికి వెళ్ళి చూశాను. కారిడార్ ఖాళీగా ఉంది. మొబైల్ లో నేను అరుదుగా మాట్లాడే ఒక వ్యక్తి కి ఫోన్ చేశాను.

ఆ తర్వాత , జగదీష్ హాస్పిటల్ లో ఇంకా పదిహేను రోజులు మాత్రమే ఉన్నాడు. ఇదివరకు రౌండ్స్ కి వెళ్ళినపుడు తప్పని సరిగా రామకృష్ణతో పరిస్థితి చెప్తూ ఉండేవాడిని. ఇప్పుడు ఆ బాధ్యత శ్రీధర్ మీద పెట్టాను. ఒక వేపు డాక్టర్ గా నేనేం చేస్తున్నా, ఇంకో వేపు మామూలు మనిషిగా అతను కోలుకోవాలని కోరుకునే వాడిని . జగదీష్ మీద ప్రేమ తో మనసంతా నిండిపోయేది.

చివరి రోజు రౌండ్స్ పూర్తి చేసి వచ్చి నా రూం లో కూర్చున్నాను.

రామకృష్ణ బయట నిల్చున్నాడు. తలుపు కొట్టి “సార్ , లోపలికి రానా?” అని అడిగాడు. రమ్మన్నట్లు తలూపాను. ఏమిటో ఆలస్యం చేస్తున్నాడని చూస్తే బయట చెప్పులు విడిచి లోపలికి వచ్చాడు.

దూరంగా నుంచున్నాడు.

" కూర్చో" అన్నాను.

తల అడ్డంగా ఊపాడు.

“రామ కృష్ణా, ఎం డీతో మాట్లాడాను. బిల్స్ సాధ్యమైనంత వరకూ తగ్గించడానికి ఒప్పుకున్నారు ఆయన.”

ఆ టైం లో బిల్ సంగతి మాట్లాడడం ఇష్టం లేకపోయినా చెప్పాను.

బయటికి వెళ్ళాడు. ఎందుకోసమోనని చూస్తుంటే చేతిలో రెండు యాపిల్ కాయలతో మళ్ళీ వచ్చాడు. వాటిని భక్తిగా నా టేబిల్ మీదుంచి మళ్ళీ వెనక్కు వెళ్ళి నిల్చున్నాడు.

“ఇప్పుడెందుకు ఇవి?” అన్నాను యాపిల్స్ ని చూస్తూ.

మాట్లాడకుండా కళ్ళు మూసుకుని చేతులు జోడించాడు. అచ్చం దేవాలయం లో నిలబడ్డ భక్తుడిలా. రెండు నిముషాల తర్వాత కళ్ళు తెరిచాడు, కళ్ళు తళుక్కుమంటున్నాయి.

"ఆ రోజున మీరేంటో తెలియక బాధపడ్డాను. నా కొడుకు కోసం నాకన్నా ఎక్కువ చేశారు. మీరెంత శ్రమపడ్డారో ---”మాటలకోసం కాసేపాగాడు.

“దేవుణ్ణి చూశాను. వెళ్ళొస్తాము సార్. " బయటికి వెళ్ళేవరకూ చేతులు జోడించే ఉన్నాడు.

రామకృష్ణ మాటలతో గుండె బరువైపోయింది.

పేషంట్లిచ్చిన కానుకలేవీ ఎప్పుడూ ఇంటికి తీసుకెళ్ళలేదు ఆ ఒక్క రోజు తప్ప.

ఇంట్లోకి వెళ్ళగానే, నా చేతిలో రెండు యాపిల్స్ ని చూసి, ముందు తను ఆశ్చర్యపోయింది.

" మరీ ఇన్ని ఫ్రూట్సా? ఇన్నిన్ని తెచ్చి ఇంట్లో పడేస్తే ఎలా?"

చాలా సీరియస్ గా అన్న తన మాటలకు నవ్వేశాను. అప్పటివరకూ బరువెక్కిన గుండె తేలికైంది.

ఆ రోజు కార్లో నా బాగ్, లంచ్ బాక్స్ పెడుతూ,

"ఇవాళ సాయంత్రం పెళ్ళికి మిమ్మల్ని తీసుకుని వస్తానని ప్రామిస్ చేశాను."

"చూద్దాంలే" అన్నాను ఎప్పటిలానే

నా ఆశ్చర్యానికి బదులుగా " ఎవరి పెళ్ళికీ వెళ్ళకపోతే , మన పిల్లల పెళ్ళికి ఎవరూ రారేమోనని భయంగా ఉంది"

" అలాంటి భయాలేం పెట్టుకోవద్దు. పిలవకపోయినా వచ్చేవాళ్ళున్నారు మనకు." అంటూ వెళ్ళిపోయాను.

నాలుగవుతుండగా మళ్ళీ ఇంటి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది పెళ్ళికి వెళ్ళాలంటూ. నేను పనిలో ఉండగా ఇదివరకెప్పుడూ అలాంటి ఫోన్ వచ్చిన గుర్తే లేదు.

అప్పటికో కేస్ థియేటర్ లో ఉంది. ' అది పూర్తయేసరికి లేటవుతుందేమో.' అనుకుని

"కుదరదేమో, పోనీ నువ్వొక్కదానివే వెళ్ళేసేయ్" అని సలహా ఇచ్చి థియేటర్ కు వెళ్ళిపోయాను.

ఇంటికెళ్ళేసరికి పది అవుతూ ఉంది. పెళ్ళి నుండి అప్పుడే వచ్చిందేమో, తను పట్టు చీరలోనే ఉంది.

"ఎంత సేపైంది వచ్చి?"

"రావడం కాదు. మీరొస్తే వెళ్దామని చూస్తున్నా."

" ఈ పాటికి అందరూ వెళ్ళిపోయి ఉంటారేమో కదా."

"ఏం వెళ్లరు. మీరు రెడీ అవండి."

ఈ రోజుల్లో పెళ్ళికెళ్ళి రావడం ఒక రకంగా చాలా తేలిక, లైన్లో నుంచుని అక్షింతలు వేసేస్తే సరి.

ఆ తర్వాత జంటతో ఒక ఫోటో.

మెట్లు దిగుతుంటే, భోంచేసి వెళ్ళమన్న ఒక హెచ్చరిక.

'అంతే కదా' అని రెడీ అయాను. రాత్రి పదకొండవుతోంది. రోడ్ లమీద ట్రాఫిక్ లేదు.

కార్లో వెళ్తూ, చిన్నతనం లో మా ఇంట్లో పెళ్ళిళ్ళు ఎలా జరిగేవో తనతో చెప్తున్నాను.

ఇంటి ముందే పందిరేసి పెళ్ళిచెయ్యడం, పచ్చి తాటాకుల వాసనలు,వంట , వడ్డించడం అంతా చుట్టాలే చేయడం అన్నీ గుర్తు తెచ్చుకుంటున్నాం.

పెళ్ళి మండపం వచ్చింది. కారాపి ఎక్కడ పార్క్ చెయ్యాలా అని చూస్తున్నాను. ఎక్కడినుండో పరుగున వచ్చాడొకతను. అతన్ని చూడగానే ఎక్కడో చూసిన జ్ఞాపకం.

ఎవరో కాదు. రామకృష్ణ. కొన్నేళ్ళ క్రితం నేను ఐసియు లో ట్రీట్ చేసిన పేషంట్ జగదీష్ వాళ్ళ తండ్రి.

ఏ పెళ్ళికెళ్ళినా ఎవరో పేషంట్లు కనపడడం మామూలే. తను కూడా పెళ్ళికొచ్చాడనుకుంటా. అతన్ని చూడగానే వాళ్ళ అబ్బాయి, కేస్ వివరాలు, అన్నీ గుర్తొచ్చాయి. దగ్గరకొచ్చి నమస్కారం చేశాడు. అదే భక్తి నమస్కారం. అచ్చంగా ఆ రోజు నా ఆఫీస్ లో పెట్టినట్లే!

కార్ డోర్ తెరిచి పట్టుకున్నాడు.

" బాగున్నావా? " పలకరించాను.

ఎవరో వచ్చి అతని చేతుల్లో రెండు దండలు పెట్టారు. ఒకటి నా మెడలో వేసి,

"అబ్బాయి పెళ్ళికి రావడానికి తమరికి చే వీలు దొరకదేమోనని ఎంతో భయపడ్డాను. అంతా అమ్మగారి చలవ " అంటూ తనవైపు తిరిగి రెండో పూలదండ భక్తిగా ఆమె చేతుల కిచ్చాడు.

“అబ్బాయి పెళ్ళా? నాకు చెప్పలేదే ”

"పిలవడానికి మీకోసం ఇంటికి రెండు సార్లొచ్చాడు. మీరు లేరు." పక్కనే సీతమ్మ సాయమొచ్చింది.

“ముహూర్తం ఎన్నింటికి?”

“ మీరు పందిట్లో అడుగుపెట్టినప్పుడే ముహూర్తం అని వియ్యంకుడు గారికి ముందే చెప్పాను" ఎవరినెవరినో తీసుకొచ్చి నా గురించి గొప్పగా చెప్తున్నాడు.

పెళ్ళికొడుకు రూపంలో ఉన్న జగదీష్ వచ్చి కాళ్ళకు మొక్కాడు.

ఎవరికో సైగ చేశాడు. రెండు నిముషాల్లో, మంగళవాయిద్యాల వాళ్ళొచ్చి మా ముందు నిలబడి స్వాగతం పలికారు. మేళతాళాలతో లోపలికి తీసుకెళ్తున్నారు.

ఊహించని ఆ స్వాగతానికి మొహమాటం అనిపించింది. నేనెవరో చుట్టూ ఉన్న బంధువులకు సంబరంగా చెప్తున్నాడు . వాళ్ళందరి నమస్కారాలు, ఆ మంగళ వాయిద్యాలు, అలవాటు లేక కొద్దిగా సిగ్గుగానే ఉంది. ఏదైనా చెప్పేది వినిపించుకునే పరిస్థితిలో లేడు రామకృష్ణ. అతన్ని ఆపడానికి ప్రయత్నించడం కూడా కుదిరేపని కాదని తెలుస్తోంది.

" దేవుడి ఊరేగింపులాగా ఉంది.” తను నాకే వినిపించేంత మెల్లగా అంది.

"ఏం? దేవుడిని కాదంటావా?"

"మరి నాకెందుకీ పూజలు"

"వాళ్ళకు దేవుడినయ్యానంటే, అందులో నీ హస్తం లేదంటావా? నీకూ తప్పదు"

"నిజంగానే దేవుడినని ఫీలవుతున్నారా?"

"అవును"

'జగమంతటా నిండి ఉన్న పరమాత్మ నాలోనూ ఉన్నాడు.'

'అహం బ్రహ్మాస్మి!'

*(వచ్చేనెల మరోకథతో కలుసుకుందాం)*

Post your comments